క్లుప్తంగా

బీటీ రోడ్లపై కేజ్ వీల్స్ తిప్పితే జరిమానా

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో గల బీటీ రోడ్లపై ట్రాక్టర్ కేజ్ వీల్స్ తిప్పితే సంబంధిత యజమానులకు జరిమానా విధిస్తామని ఎస్సై రంజిత్ కుమార్ హెచ్చరించారు. బీటీ రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లో కేజ్ వీల్స్ తిప్పొద్దన్నారు. ఈ విషయాన్ని ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, రైతులు గమనించాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): గట్టుమైసమ్మ తండాలోని ప్రాథమిక పాఠశాల పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. గత నెల 28న సాక్షి దినపత్రికలో 'పొంచి ఉన్న ముప్పు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దాంతో ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటుకు మార్చారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్య తొలగిపోవడంతో తండావాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

'విద్యుత్ స్తంభాలను సరిచేశారు'



నస్రుల్లాబాద్: మండలంలో విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు సరి చేశారు. జూన్ 30న సాక్షి పేపర్‌లో వచ్చిన 'ప్రమాదకరంగా స్తంభాలు' కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా మీర్జాపూర్ గ్రామానికి చెందిన వంగిన విద్యుత్ స్తంభాలు నాలుగింటిని విద్యుత్ శాఖ అధికారులు సరి చేశారు. వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను నరికేశారు. విద్యుత్ అంతరాయం జరగకుండా జాగ్రత్త వహించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి చదువుతున్న గీతం అనే విద్యార్థి అండర్–12 విభాగం లాంగ్ జంప్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. ఈ నెల 6న హన్మకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. హెచ్ఎం యూసుఫ్, అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అనిల్ జైన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

కామారెడ్డి టౌన్: ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం సివిల్ సప్లయ్ జిల్లా అధికారి భిక్షపతికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఏడు సివిల్ సప్లయ్ గోదాంలలో పని చేసే కార్మికులు సమ్మెలో పాల్గొంటారని అనుమతి ఇవ్వాలని కోరారు.

బిచ్కుంద(జుక్కల్): మధ్యాహ్న భోజన ఏజెన్సీ, కార్మికుల సమస్యలపై ఈ నెల 9న సమ్మె చేస్తున్నామని తెలుపుతూ బుధవారం సీఐటీయూ నాయకుడు సురేష్ గొండ, కార్మికులు.. ఎంపీడీవో గోపాల్, ఎంపీవో కృష్ణకు నోటీలు అందజేశారు. కార్మిక సంఘాలు హాజరుకావాలని వారు కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి దేవి ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. దేవాదాయశాఖ పరిశీలకులు కమల, ఈవో ప్రభు ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. హుండీ ద్వారా రూ. 95, 344 నగదు వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భూకన్‌పల్లి ఆలయానికి రూ.50 లక్షల నిధులు మంజూరు



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని భూకన్‌పల్లి శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం సాయంత్రం నిధుల మంజూరు ఉత్తర్వులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆలయ ప్రతినిధులు టి.అంజనేయులు, మామిండ్ల అంజయ్యలకు అందజేశారు.

విద్యుత్ వినియోగం.. కారాదు కాటికి ప్రయాణం

- అజాగ్రత్త వల్ల ప్రాణాలు కోల్పోతున్న రైతులు
- సొంతంగా మరమ్మతులు చేయటం ప్రమాదకరం



తిమ్మారెడ్డిలో మరణించిన యువ రైతు రవి (ఫైల్)



మాచాపూర్‌లో స్తంభం విరిగి నేలమీద పడి ఉన్న విద్యుత్ తీగలు(ఫైల్)

ఎల్లారెడ్డి: విద్యుత్ వినియోగంలో కొద్దిపాటి అజాగ్రత్త.. నిర్లక్ష్యం.. వినియోగదారులకు శాపంగా మారుతున్నాయి. జూన్ 22న ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ తండా గ్రామానికి చెందిన నేనావత్ రవికుమార్(32) అనే గిరిజన రైతు ఇంటి ముందు సింగిల్ ఫేజ్ మోటారును ఆన్ చేయబోయి కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని మాచాపూర్ గ్రామ పరిధిలో గల వ్యవసాయ భూమిలో గాలివానకు విద్యుత్ స్తంభం విరిగిపోయి విద్యుత్ తీగలు తెగి నేల మీద పడి 40 రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ బెస్త సాయిలు అనే రైతు స్థానిక వాట్సాప్ గ్రూపులలో వైరల్ చేశాక గాని విద్యుత్ సిబ్బంది సరి చేయలేదు. కామారెడ్డి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ఇద్దరు, మే నెలలో ఏడుగురు, జూన్‌లో ముగ్గురు కలిపి 12 మంది పలు కారణాల వల్ల కరెంట్ షాక్‌లతో మృతి చెందారు. అదే విధంగా మార్చి నుంచి ఇప్పటి వరకు 19 పశువులు కరెంటు షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి.

సొంతంగా రిపేర్లు చేయడమే కారణం..

వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులు ప్రమాదమని తెలిసినా అజాగ్రత్తగా వ్యవహరిస్తుండటంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఒక వైపు వర్షం కురుస్తున్నా బోరు మోటార్లను, ట్రాన్స్‌ఫార్మర్లను స్వంతంగా రిపేర్లు చేయడం.. విద్యుత్ తీగలకు లూప్‌లు(కొండ్లు) వేసి అక్రమంగా విద్యుత్ వాడుకోవడం లాంటి నిర్లక్ష్య పనులతో రైతులు ప్రాణాలను కోల్పోతున్నారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నా వాటిని సరి చేయాల్సిన విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలివేయడం కూడా అమాయకుల ప్రాణాలు బలికావడానికి కారణమవుతున్నాయి. ఇళ్ల విద్యుత్ వైరింగ్ కోసం నాణ్యమైన వైర్లను, పరికరాలను వాడకపోవడం, షార్ట్ సర్క్యూట్ కాకుండా ఎర్తింగ్ సరిగా చేయించకపోవడం తదితర కారణాల వల్ల ఇళ్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి. ఇళ్లలో కరెంట్ మీటర్లు, ఫ్యూజు బాక్స్‌లకు దగ్గరగా కూడా జీఏ వైర్లతో దండేలు కట్టి తడి బట్టలను ఆరేయడం పలుమార్లు కరెంటు షాక్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రాణాలతో చెలగాటమే.

రబ్బర్ గ్లౌజ్‌లు, ప్లాస్టిక్ బూట్లు వాడటం ఉత్తమం..

రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుని బోర్లను స్టార్ట్ చేయాలి. వీలైతే విద్యుత్ షాక్ తగలని రబ్బరు గ్లౌజ్‌లు, ప్లాస్టిక్ బూట్లను మోటార్ల మరమ్మతుల సమయంలో వాడటం మంచిది. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు, వేలాడే విద్యుత్ తీగల గురించి తదితర ఏ సమస్యలున్నా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. స్వంత మరమ్మతులు చేయకూడదు. వ్యవసాయ భూముల్లో చాలా వరకు కరెంటు షాక్ ప్రమాదాలు బోర్ మోటార్ల వద్దే జరుగుతుంటాయి. వ్యవసాయ పంపుసెట్లను వాడేటప్పుడు మోటార్లను, స్టాటర్ బాక్స్‌లను, పైపులను ఏమరుపాటుగా తాకకూడదు. స్టాటర్ బాక్స్‌లు ఇనుమువి కాకుండా ప్లాస్టిక్ బాక్స్‌లు వాడటం క్షేమం. తడిచిన బట్టలతో వర్షం పడుతున్నప్పుడు ఎట్టి పరిస్థితిలో తాకవద్దు. విద్యుత్ సిబ్బందికి తెలియకుండా ఫ్యూజులు మార్చడం, కాలిపోయిన తీగలను ఎట్టి పరిస్థితుల్లో సరిచేయాలని ప్రయత్నించొద్దు. బోరు మోటార్ల స్టాటర్లను ప్లాస్టిక్ బాక్స్‌లలోనే బిగించాలి. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి తమ పశువులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తమ పంటలను రక్షించుకునేందుకు ఎట్టి పరిస్థితులో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసుకోకూడదు. వీటి వల్ల మనుషుల, పశువుల ప్రాణాలకు అత్యంత ప్రమాదం.. తెలిసీ తెలియని జ్ఞానంతో విద్యుత్ పరికరాలను ఎలాంటి జాగ్రత్త చర్యలు లేకుండా మరమ్మతులకు తలపడటం ప్రాణాలతో చెలగాటమే.

బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి

- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్



మోహన్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

బాన్సువాడ: బంజారాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆలిండియా బంజారా సేవ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన మోహన్‌నాయక్‌కు బుధవారం బాన్సువాడలో బంజారా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 12న బంజారా సేవ సంఘం బాన్సువాడ డివిజన్, మండల కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ వస్తున్నారని చెప్పారు. నాయకులు సురేందర్ రాథోడ్, మోతీసింగ్, ప్రతాప్‌సింగ్, సీనునాయక్, సాదర్, సర్వన్ నాయక్, తదితరులున్నారు.

పౌష్టికాహారం అందించకపోవడంపై ఆగ్రహం



నస్రుల్లాబాద్: నాచుపల్లి మినీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఎంఈవో చందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బాలికలకు గుడ్డు పెట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది ప్రారంభం నుంచి కాంట్రాక్టర్ గుడ్డు సరఫరా నిలిపివేశారని నిర్వాహకులు చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక పంపించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి



మద్నూర్(జుక్కల్): మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలుపుతూ బుధవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సరస్వతి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ మాట్లాడుతూ.. ఏజెన్సీ కార్మికులందరూ ఒక్కరోజు సమ్మెలో పాల్గొలని వారు సూచించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



గాంధారిలో జీపీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్



లింగంపేటలో.. ఎంపీడీవో నరేష్

గాంధారి(ఎల్లారెడ్డి): గ్రామాల్లో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గాంధారి, లింగంపేట ఎంపీడీవోలు రాజేశ్వర్, నరేష్‌లు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాలలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలపై సమీక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వీధులు, ఇళ్ల పరిసరాల్లో నీటి గుంతలు పూడ్చివేయాలన్నారు. మురికి నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. దోమల బెడద అధికంగా ఉన్నట్లయితే ఫాగింగ్ చేయాలని సూచించారు. ఎంపీవోలు లక్ష్మీనారాయణ, మలహరి, సబ్‌యూనిట్ అధికారి గోవింద్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

బీబీపేట: తుజాల్‌పూర్ గ్రామంలో గ్రామ వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ప్రవీణ్ 8555096404 నంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

స్వర్ణకారులకు ఉపాధి లేకుండా చేయొద్దు

కామారెడ్డి టౌన్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఓ ప్రముఖ జువెలరీ సంస్థ బంగారు ఆభరణాల తయారీ కర్మాగారాన్ని స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈనెల 4న ప్రారంభించనుండటం సరికాదని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకారుల జిల్లా సంఘం నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. ప్రముఖ కంపెనీలను ప్రభుత్వం ప్రోత్రహిస్తే స్వర్ణకార చేతి వృత్తులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక స్వర్ణకారులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాయకులు రాఘవాచారి, వెంకటస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల పరిశీలన

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మొక్కలను నాటేందుకు తవ్వుతున్న గుంతలను ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి మొక్కలను నాటుతామన్నారు.

సహకార సంఘం వారోత్సవాలు

నస్రుల్లాబాద్/భిక్కనూరు: నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో, భిక్కనూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సహకార సంఘ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం సభ్యత్వాలను అందించారు. అనంతరం వారోత్సవాలను పురస్కరించుకొని పలు చోట్ల మొక్కలు నాటారు.

సంక్షిప్తం

మధ్యాహ్న భోజనం పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బుధవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

మినీ ట్యాంక్ బండ్ పనులు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులను నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎస్ఈ మల్లేష్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ రాజేష్‌బాబు తదితరులున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు బుధవారం వారి ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేసినట్లు తహసీల్దార్ రేణుక చౌహాన్ తెలిపారు. నాయకులు తూర్పు రాజు, మదార్, అల్తాఫ్, సంగని బాబా, గడ శంకర్, అహ్మద్, ఈశ్వర్ గౌడ్, పాల్గొన్నారు.

కళాశాలలో పుస్తకాలు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపల్ నిజాం బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, బాగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. లెక్చరర్లు రమేష్, నాగయ్య, రాములు తదితరులున్నారు.

26 మంది రైతులకు నూతనంగా పంట రుణాలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో ఆధ్వర్యంలో 26 మంది రైతులకు నూతన పంట రుణాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య మాట్లాడుతూ.. 26 మంది రైతులకు రూ.22 లక్షల 88 వేల రుణాన్ని అందించామని తెలిపారు. విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రకు తరలిన ఇస్కాన్ సభ్యులు

బాన్సువాడ: కామారెడ్డిలో బుధవారం జరిగిన జగన్నాథ రథ యాత్ర మహోత్సవానికి బాన్సువాడ నుంచి ఇస్కాన్ సభ్యులు తరలివెళ్లారు. బాన్సువాడకు చెందిన వెంకటదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో సుమారు 40 మంది వెళ్లారు.

సైబర్ నేరాలను ముందుగానే పసిగట్టాలి



మద్నూర్(జుక్కల్): సైబర్ నేరాలను ముందుగానే పసిగట్టి జాగ్రత్త పడాలని ఎస్సై విజయ్ కొండ సూచించారు. మేనూర్ మోడల్ స్కూల్, కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, షీ టీం గురించి, డ్రగ్స్, ట్రాఫిక్ పోలీసు నియమాలపై అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలను గుర్తించాలని, ఇంట్లో తల్లిదండ్రులకు, అక్కాచెల్లెళ్లకు అవగాహన కల్పించాలని, మహిళల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే 100 నెంబరుకు ఫోన్ చేయాలని ఎస్సై సూచించారు.

పనులను వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. బుధవారం లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

అర్హత ఉన్నా అందని ఇందిరమ్మ ఇల్లు

- గాంధారిలో వర్షానికి కూలిన పారిశుధ్య కార్మికురాలి పూరిల్లు
- మొదటి విడతలో మంజూరు కాని వైనం
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్న బాధితురాలు



గాంధారి ఎస్సీ కాలనీలో కూలిన పూరిల్లు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నివాసముండే జీపీ పారిశుధ్య కార్మికురాలు బస లలిత పూరిల్లు మంగళవారం కురిసిన వర్షానికి కూలిపోయింది. ఉన్న చిన్న పూరిల్లు కూలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులున్నారు. బస లలిత తన ఇద్దరు కుమారులు, కోడలు, పిల్లలతో పూరిగుడిసెలో నివాసముంటుంది. వర్షానికి పూరిల్లు గోడ కూలడంతో ఆవేదన చెందుతోంది. 'పేదరికంలో ఉన్నాను. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. అయినా తనకు మొదటి విడతలో ఇల్లు మంజూరు కాలేదు. ఉన్న పూరిల్లు కూలడంతో ఏమిచేయాలో అర్థం అయితలేదు. చాలీచాలని దినసరి వేతనంతో జీపీ పారిశుధ్య కార్మికురాలిగ పనిచేస్తున్న. నా కొడుకులు కూలీ పని చేస్తారు. మా కాలనీలో అద్దె ఇళ్లు కూడా లభించవు. వేరే కాలనీల్లో నెలకు వేల రూపాయలు కిరాయి చెల్లించలేము. మా పరిస్థితిని అధికారులు చూసి ఇందిరమ్మ ఇప్పించాలి' అని ఆమె వేడుకున్నారు.

సాంకేతిక కారణాలతో రాలేదు

ఇందిరమ్మ ఇల్లు కోసం మొదటి విడతలో పంపిన జాబితాలో ఆమె పేరును సిఫారసు చేశాం. కాని కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆమెకు ఇల్లు మంజూరు కాలేదు. రెండో విడతలో ఆమె కోడలు బస మంజుల పేరు పంపించాం. రెండో విడతలో మంజుల పేరున ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, జీపీ కార్యదర్శి, గాంధారి

మాయమవుతున్న కుచ్చలు



పిట్లంలో జేసీబీ సహాయంతో ఎల్లమ్మ కుచ్చ వద్ద చేపడుతున్న తవ్వకాలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రం శివారులోని ఎల్లమ్మ గుట్టను అనుమతులు లేకుండా తోడేస్తున్నారు. నిబంధనల ప్రకారం మొరం కావలసిన వారు సంబంధిత తహసీల్ కార్యాలయంలో మొరం కావల్సిన ట్రాక్టర్ల ప్రకారం చలానా కట్టి మొరం తీసుకెళ్లాలి.. కానీ ఇవేమి పట్టించుకోకుండా అధికారుల అండదండలతో అక్రమంగా మొరం తోడేస్తున్నారు.అక్రమంగా మొరం తరలించడంతో గ్రామానికే అలంకారప్రాయంగా ఉన్న గుట్టలు, కుచ్చలు మాయం అవుతున్నాయి. ఇళ్ల నిర్మాణానికే కాకుండా వెంచర్లలకు కావల్సిన మొరాన్ని దర్జాగా తోడేస్తున్నారు. ఇంతే కాకుండ రహదారులు, ఇటుక బట్టీల కోసం చెరువులలో మట్టిని జేసీబీ సహాయంతో మట్టిని తీసుకెళ్తున్నారు. ఇష్టం వచ్చినట్లు మట్టిని తీయడంతో ప్రమాదకరంగా పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లు లేకపోవడం గమనర్హం.

బీజేపీని బలోపేతం చేయాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



లక్ష్మీరావులపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

మాచారెడ్డి: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం అంతంపల్లి, లక్ష్మీరావులపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి అవినీతి రహిత పాలనను అందుకోవాలని ప్రజలను కోరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బూస సురేశ్, సీనియర్ నాయకులు పొన్నాల వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, శేఖర్, హారిక, సాయి, భరత్ యాదవ్, కిషన్‌గౌడ్, బాల్ చంద్రం, రవి, కల్యాణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉప్పల శ్రీనివాస్



సన్మానిస్తున్న స్థానిక కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉప్పల శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాన్సువాడకు వచ్చిన ఆయనను మార్కెట్ కమిటీలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, పట్టణ అధ్యక్షులు మాసాని శేఖర్‌రెడ్డి, నాయకులు కొత్తకొండ భాస్కర్, గూడెం శ్రీనివాస్, పాత బాలకృష్ణ, గాదం సత్యనారాయణ, తదితరులున్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: ఈ నెల 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియలో జరిగే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభను విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవరాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు గుడుగుల శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిత్యం అభ్యాసన చేయించాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థులకు నిత్యం అభ్యాసన చేయిస్తూ వారి సామర్థ్యాలను మెరుగుపర్చాలని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు మంజూరైన వర్క్‌బుక్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

చినుకు పడితే చిత్తడే..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ధర్మారావ్‌పేట్, అమర్లబండ, మోడెగాం, లింగంపల్లి, భూంపల్లి, తిర్మన్‌పల్లి, మర్కల్ గ్రామాలకు వెళ్లే రోడ్లు వర్షం ధాటికి చిత్తడిగా మారుతున్నాయి. బీటీ రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి గుంతలను పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.